RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 252 | సంపుటి 4 | శుక్రవారం | 05-06-2026 | పేజీలు 4 | వెల 3/-



2

- కుటుంబ పెద్ద మృతితో దిక్కుతోచని స్థితిలో భార్య, కుమార్తె
- అంతిమ సంస్కారాలకు కూడా డబ్బుల్లేని కుటుంబానికి గ్రామం చేయూత
- కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఒక్కటైన ఉప్పరపల్లి ప్రజలు
- చందాలు సేకరించి రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేత
- "మేమున్నాం" అంటూ బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు
- స్వార్థం పెరిగిన కాలంలో మానవత్వాన్ని చాటిన గ్రామ ప్రజలు
- కన్నీటి పర్యంతమైన మృతుడి భార్య, కుమార్తె
- తోటి మనిషి కష్టాన్ని తమ కష్టంగా భావించిన గ్రామస్తుల ఉదారత

# మానవత్వానికి నిదర్శనం ఉప్పరపల్లి

## పేద కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు

డబ్బు, హోదా, స్వార్థం చుట్టూ తిరుగుతున్న నేటి సమాజంలో మానవ సంబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయనే భావనకు కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామం తన చేతలతో సమాధానం చెప్పింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి ఆకస్మిక మరణంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన ఓ నిరుపేద కుటుంబానికి గ్రామమంతా ఒక్కటై అండగా నిలిచి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి కూడా చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితిలో కన్నీటి పర్యంతమవుతున్న తల్లి, కుమార్తె ఆవేదనను చూసి గ్రామస్థుల హృదయాలు చలించిపోయాయి. కులం, మతం, రాజకీయాలు, వర్గ భేదాలు అన్నింటినీ పక్కనపెట్టి "వాళ్ల కష్టం మన కష్టం" అన్న భావనతో ముందుకొచ్చిన ఉప్పరపల్లి ప్రజలు రూపాయి రూపాయి చందాలు సేకరించి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. ఆపదలో ఉన్న ఓ కుటుంబానికి కొండంత అండగా నిలిచి వారి కన్నీళ్లు తుడిచిన గ్రామస్థుల ఈ ఉదారత, స్వార్థం పెరిగిపోతున్న నేటి కాలంలో మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని చాటిచెప్పింది. ఉప్పరపల్లి గ్రామం చూపిన ఈ సామాజిక బాధ్యత, ఐకమత్యం, సేవాభావం నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. — కేసముద్రం, ప్రభాత గమనం

# 'బడిబాట'ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

- బడిబయటి పిల్లలు బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ స్నేహ శబరీష్



04

# గంజాయి రహిత జిల్లాగా మానుకోట

3

- 4 వేల అత్యాధునిక టెస్టింగ్ కిట్లతో పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
- 10 నిమిషాల్లోనే మాదకద్రవ్యాల వినియోగం నిర్ధారణ
- డీ-అడిక్షన్ కార్యక్రమాలతో బాధితులకు పునరావాసం
- సమాచారం ఇచ్చేవారి వివరాలు పూర్తిగా గోప్యం :ఎస్పీ డా. శబరీష్

మహబూబాబాద్ జిల్లాను పూర్తిస్థాయిలో గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలను సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో 4,000 అత్యాధునిక టెస్టింగ్ కిట్లను అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు, డీ-అడిక్షన్ చర్యలను కూడా ముమ్మరం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రసాభాసగా మహబూబాబాద్

# మున్సిపల్ సమావేశం



- మీడియా నిషేధం, నిధుల కేటాయింపులపై విపక్షాల ఆందోళన
- కౌన్సిల్ హాల్‌లోకి మీడియాను అనుమతించకపోవడంపై తీవ్ర నిరసన
- రూ.59 కోట్ల నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదంతో హీటెక్కిన సమావేశం
- బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్ల నిరసనకు ఎమ్మెల్సీ రవీందర్ రావు మద్దతు

04

మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం రాజకీయ వేడిని రాజేస్తూ తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య సాగింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే మీడియా ప్రతినిధులను కౌన్సిల్ హాల్ లోకి అనుమతించకపోవడంపై సీపీఐ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు, మున్సిపల్ పాలనలో లోపాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే మీడియాను అడ్డుకుంటున్నారని ఆరోపించిన విపక్ష సభ్యులు పోడియంను ముట్టడించి నినాదాలు చేశారు. మరోవైపు మున్సిపాలిటీకి వచ్చిన రూ.59 కోట్ల నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలని, ప్రతి వార్డుకు రూ.50 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు ఇస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని అధికార పక్షాన్ని నిలదీశారు. దీనికి అధికార పక్ష సభ్యులు ప్రతిస్పందించడంతో సమావేశం ఒక్కసారిగా హీటెక్కింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో కౌన్సిల్ హాల్ దద్దరిల్లిపోయింది. వార్డుల అభివృద్ధి, తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీలు, మార్కెట్ భవనాల వినియోగం, ప్రజా స్థలాల పరిరక్షణ వంటి అంశాలపై విపక్షాలు అధికారులను నిలదీయగా, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అధికార పక్షం సమర్థించుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ జరగాల్సిన సభ రాజకీయ విమర్శలు, నిరసనలు, నినాదాలతో సాగడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

—మహబూబాబాద్, ప్రభాత గమనం

# అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

- క్షణాల్లో అగ్నికుండంగా మారిన కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనం
- మూడు అంతస్తుల భవనాన్ని చుట్టుముట్టిన మంటలు
- దుస్తుల నిల్వలతో వ్యాపించిన అగ్ని
- అప్రమత్తమైన వ్యాపారులు.. విలువైన వస్తువుల తరలింపు
- మంటల అదుపునకు రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కోణంలో దర్యాప్తు



3

# పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష
- అన్ని శాఖల సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు డెయిరీ రంగం కీలకమన్న ఎమ్మెల్యే
- పాల సేకరణ కేంద్రాల బలోపేతం, సభ్యుల నమోదుపై ప్రత్యేక దృష్టి
- హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాల పురోగతిపై సమీక్ష

04





- మానవత్వం మరువని మనుషులు.. పేద కుటుంబానికి అండగా నిలిచిన ఉప్పరపల్లి
- కడచూపుకు కరువైన వేళ.. కదిలివచ్చిన ఊరు...
- అంతిమ సంస్కారాలకూ లేని దీనస్థితిలో మృతుడి కుటుంబం...
- రూపాయి రూపాయి పోగు చేసి రూ. 30 వేల ఆర్థిక సాయం అందించిన గ్రామస్థులు...
- కన్నీటి పర్యంతమైన భార్య, కూతురు
- ఉప్పరపల్లి ఉదారతపై సర్వత్రా ప్రశంసలు..

# మానవత్వానికి నిదర్శనం ఉప్పరపల్లి

## పేద కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు

**కేసముద్రం, జూన్ 4 (ప్రభాత గమనం) :**

"డబ్బే పరమావధి... స్వార్థమే జీవన విధానం" అనుకుంటూ మనుషుల మధ్య బంధాలు, బాధ్యతలు మృగ్యమైపోతున్న ఆధునిక సమాజంలో ఆ గ్రామం ఒక వెలుగుచుక్కలా నిలిచింది. అంతా నాటక రంగంలా మారిపోతున్న కాలంలో.. తమ గ్రామంలోని ఒక పేద కుటుంబానికి జరిగిన విషాదంలో "మేమున్నామంటూ" యావత్ గ్రామం కదిలివచ్చింది. మనుషుల మధ్య ఇంకా మానవత్వం సజీవంగానే ఉందని ఉప్పరపల్లి ప్రజలు తమ ఉదారతతో నిరూపించారు.గ్రామానికి చెందిన మంద సారయ్య ఇటీవల హఠాన్మరణం చెందారు. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన పెద్ద దిక్కు ఒక్కసారిగా కన్నుమూయడంతో ఆయన భార్య అమల, కూతురు ప్రియా రోడ్డున పడ్డారు. ఒకపక్క గుండెనవిసేలా చేస్తున్న పుట్టెడు దుఃఖం.. మరోపక్క కనీసం అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి కూడా చేతిలో పైసా లేని దీన స్థితి ఆ కుటుంబాన్ని మరింత కుంగదీసింది. కడచూపుకు కూడా నోచుకోని స్థితిలో ఉన్న ఆ తల్లి, కూతురి ఆవేదన, వారి కన్నీటి రోదనలు గ్రామస్థుల మనసులను చలింపజేశాయి.విపత్కర పరిస్థితుల్లో ఉన్న ఆ ఆడబిడ్డను, తల్లిని చూసి ఉప్పరపల్లి గ్రామస్థులు తక్షణమే స్పందించారు. కులమతాలకు, రాజకీయాలకు, వర్గ భేదాలకు అతీతంగా ఊరంతా ఒక్కటై రంగంలోకి దిగారు. ఎవరికి తోచిన సాయం వారు చేస్తూ, రూపాయి రూపాయి పోగు చేస్తూ చందాలు వసూలు చేశారు. సారయ్య దహన సంస్కారాల నిమిత్తం సుమారు రూ. 30 వేల వరకు నగదును అత్యంత వేగంగా సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామస్థులు చూపిన ఈ చొరవతో సారయ్య అంతిమ యాత్ర గౌరవప్రదంగా ముగిసింది.నగదు అందజేస్తున్న సమయంలో మృతుడి భార్య అమల, కూతురు ప్రియా కన్నీటి పర్యంతమయ్యారు. "విపత్కర సమయంలో, దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు కొండంత అండగా నిలిచిన గ్రామస్థుల రుణం ఈ జన్మలో తీర్చుకోలేము" అంటూ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న ఒక నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, వారి కన్నీళ్లు తుడిచిన ఉప్పరపల్లి గ్రామ ప్రజల ఉదారతపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. స్వార్థం రాజ్యమేలుతున్న నేటి సమాజంలో, ఈ సంఘటన మానవత్వానికి ఒక గొప్ప ఉదాహరణగా, నిదర్శనంగా నిలిచింది. తోటి మనిషి కష్టాన్ని తమ కష్టంగా భావించిన ఉప్పరపల్లి ప్రజలు నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు.



# భారత్‌లో ఎబోలా కలకలం..

- అప్రమత్తమైన ఆరోగ్య శాఖ.. కఠిన నిఘా, గృహ నిర్బంధంలో ప్రయాణికులు
- కాంగో, ఉగాండా, ఇథియోపియా నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులపై నిఘా
- ఇప్పటివరకు దేశంలో ఎబోలా కేసులు నిర్ధారణ కాలేదన్న కేంద్రం
- అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కఠిన తనిఖీలు, థర్మల్ స్క్రీనింగ్
- ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారికి 21 రోజుల పర్యవేక్షణ
- శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుడిని ఐసోలేషన్ కు తరలింపు

**న్యూఢిల్లీ, జూన్ 4 (ప్రభాత గమనం):**

ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తుల ఆచూకీని గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వారిలో ఎలాంటి ఎబోలా లక్షణాలు నిర్ధారణ కాలేదని, కేవలం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆఫ్రికాలోని కాంగో, ఉగండా దేశాల్లో బుండిబుగ్యో రకం ఎబోలా వ్యాప్తి కొనసాగుతోంది. ఈ పరిస్థితిని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా (PHEIC) ప్రకటించింది. ప్రస్తుతం అక్కడ వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

**భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ**

ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు 21 రోజుల పాటు తమ ఆరోగ్య పరిస్థితిని గమనించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య అధికారులను సంప్రదించాలని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో ఎబోలా కేసులు ఏవీ నిర్ధారణ కాలేదని స్పష్టం చేసింది.

**ఎయిర్‌పోర్టుల్లో కట్టుదిట్టమైన తనిఖీలు**

ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం దేశవ్యాప్తంగా అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, హైదరాబాద్ తదితర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో థర్మల్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలను తప్పనిసరి చేశారు. సముద్ర ఓడరేవుల వద్ద కూడా కఠిన నిఘా కొనసాగుతోంది. దేశంలోకి వైరస్ ప్రవేశించకుండా ముందస్తు చర్యలను మరింత బలోపేతం చేశారు.

**శంషాబాద్‌లో అప్రమత్తమైన వైద్య బృందాలు**

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఓ ప్రయాణికుడికి ఎబోలా సంబంధిత ప్రయాణ చరిత్ర ఉన్నట్లు గుర్తించడంతో వైద్య బృందాలు అప్రమత్తమయ్యాయి. అతడిని వెంటనే ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రానికి తరలించి నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపించారు. ఫలితాలు వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు

- తెలంగాణ ఉద్యమ లక్ష్యాలు ఇప్పటికీ నెరవేరలేదు
- కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ వీ తొందరపాటు నిర్ణయాలు
- జనసేనను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయి
- రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ సెంటిమెంట్
- రాష్ట్రంలో బీజేపీ ఓట్ల శాతం పెరుగుతోంది
- మీట్ ది ప్రెస్' లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం) :**

హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగినప్పటికీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ లక్ష్యాలు పూర్తిగా నెరవేరలేదని అన్నారు. యూనివర్సిటీలు ఇప్పటికీ పార్ట్‌టైమ్ ఫ్యాకల్టీతోనే నడుస్తున్నాయని, ఉద్యోగాల భర్తీ ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ప్రభుత్వ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదని పేర్కొన్నారు.

**కృష్ణా జలాలపై విమర్శలు**

కృష్ణా నది జలాల పంపిణీలో 299 టీఎంసీలకే అంగీకరిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని రామచందర్‌రావు అన్నారు. ప్రస్తుతం కూడా తెలంగాణకు అన్యాయం జరిగే విధంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు చేసిందని చెప్పారు.

**జనసేన అంటే భయం ఎందుకు?**

పవన్ కల్యాణ్ సభలకు తెలంగాణలో అనుమతి ఇవ్వడంలో ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. దేశంలో ఎవరైనా ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని, జనసేన పోటీ చేస్తామంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు ఆందోళన చెందుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ సెంటిమెంట్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నాయని ఆరోపించిన ఆయన, టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు ప్రయత్నించిన కేసీఆర్‌ను అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.

**బీజేపీకి పెరుగుతున్న ఆదరణ**

స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన లభించిందని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభావం గణనీయంగా తగ్గిపోయిందని, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. పార్టీ కేంద్ర నాయకత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని అన్నారు.



# పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం

- హయత్ నగర్ వద్ద అదుపుతప్పి రెండు కార్లను ఢీకొట్టిన ట్యాంకర్
- ధ్వంసమైన కార్లు.. పలువురికి గాయాలు
- క్యాబిన్ లో చిక్కుకున్న డ్రైవర్ ను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది
- పెట్రోల్ లీకేజీతో ప్రమాద స్థలంలో అత్యవసర పరిస్థితి
- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం):**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం సమీపంలో గురువారం పెట్రోల్ ట్యాంకర్ ప్రమాదానికి గురైంది. వేగంగా వస్తున్న ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న రెండు కార్లను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కార్లలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం అనంతరం ట్యాంకర్ బోల్తాపడటంతో డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యేక పరికరాల సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయం కావడంతో అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు.

**పెట్రోల్ లీకేజీతో ఉత్కంఠ**

ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ కావడం ప్రారంభమైంది. దీంతో ప్రమాదం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అధికారులు భావించి హైఅలర్ట్ ప్రకటించారు. ట్యాంకర్ సమీపంలోకి ఎవరినీ అనుమతించకుండా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి మంటలు, స్పార్క్‌లు ఏర్పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

**భారీగా ట్రాఫిక్ జామ్**

ప్రమాదం కారణంగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు రోడ్డుపైనే చిక్కుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను సర్వీస్ రోడ్ల వైపు మళ్లించారు. ట్యాంకర్‌ను తొలగించి రహదారిని పూర్తిగా క్లియర్ చేసే వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాద స్థలంలో అగ్నిమాపక శాఖ, పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు. పెట్రోల్ లీకేజీని నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది.

# తెలంగాణలో విస్తరించిన వర్షాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా మారిన వాతావరణం
- పలు జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం
- ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం, జొన్న సంచులు
- అకాల వర్షాలతో రైతులకు నష్టం.. ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం
- నాలుగైదు రోజుల్లో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం) :**

కేరళ, తమిళనాడులోకి ఇప్పటికే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు మరింత చురుకుగా మారుతున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. అనుకూల పరిస్థితులు కొనసాగుతున్నందున మరో నాలుగైదు రోజుల్లో తెలంగాణలోకి కూడా రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాల ప్రభావంతో గురువారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. కరీంనగర్, జనగామ, సిద్ధిపేట, మెదక్, కామారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో గాలుల వేగం అధికంగా ఉండటంతో చెట్ల కొమ్మలు విరిగిపడగా, విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది.

**రైతులకు తీరని నష్టం**

అకాల వర్షాలు రైతాంగాన్ని తీవ్రంగా కలవరపరిచాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన జొన్న సంచులు వర్షానికి తడిశాయి. పలు ప్రాంతాల్లో ధాన్యం నిల్వలపై తగిన రక్షణ చర్యలు లేకపోవడంతో రైతులు నష్టపోయినట్లు సమాచారం. ఇప్పటికే పంటల విక్రయాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఈ వర్షాలతో మరింత ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే గురువారం కురిసిన వర్షాలతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలకు ఊరట లభించింది. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు.

# రూ.12 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం..

- థాయ్ లాండ్ నుంచి హైదరాబాద్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు
- ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్
- ప్రధాన నిందితుడు హేమంగ్ కెలుస్కర్ సహా 10 మంది అరెస్ట్
- ముంబయి మాఫియా, అండర్ వరల్డ్ నెట్ వర్క్ తో సంబంధాలపై దర్యాప్తు
- కిలో గంజాయిని రూ.80 లక్షలకు విక్రయిస్తున్న స్మగ్లర్లు
- దేశవ్యాప్తంగా విమానాశ్రయాల ద్వారా డ్రగ్స్ రవాణా చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం) :**

హైదరాబాద్‌లో మరో భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఈగల్ ఫోర్స్ పోలీసులు ఛేదించారు. థాయ్‌లాండ్ నుంచి హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా భారత్‌కు తరలిస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను శంషాబాద్ విమానాశ్రయం కేంద్రంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.12 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు హేమంగ్ అలియాస్ కెలుస్కర్‌తో పాటు 10 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసినట్లు ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను ముంబయికి తరలించి అక్కడి నెట్‌వర్క్ ద్వారా విక్రయించేందుకు ముఠా ప్రణాళిక రచించినట్లు విచారణలో తేలిందన్నారు.

**ముంబయి మాఫియాతో లింకులు**

ప్రధాన నిందితులు హేమంగ్, సూరజ్ పాల్ పలుమార్లు హైదరాబాద్‌కు వచ్చినట్లు గుర్తించామని, వీరికి ముంబయి మాఫియా ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు లభించాయని సందీప్ శాండిల్య తెలిపారు. కోకాపేటలోని ఓ ప్రముఖ క్లబ్‌కు వీరు తరచూ వచ్చేవారని, ఆర్థిక లావాదేవీల కోసం బ్యాంకింగ్ వ్యవస్థను ఉపయోగించకుండా పూర్తిగా నగదు చెల్లింపులకే ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు.

**కిలో ధర రూ.80 లక్షలు**

థాయ్‌లాండ్‌లో సాగు చేస్తున్న హైడ్రోపోనిక్ గంజాయిని హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్, ఢిల్లీ వంటి ప్రధాన నగరాలకు విమాన మార్గాల ద్వారా తరలిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. థాయ్‌లాండ్‌లో కిలో గంజాయి ధర సుమారు రూ.3 లక్షలు ఉండగా, భారత్‌లో అదే గంజాయిని రూ.80 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. భారీ లాభాల కోసం ప్రత్యేక స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**విచారణలో బయటపడిన బండారం**

రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్ కూడలి వద్ద నిర్వహించిన తనిఖీల్లో గుజరాత్‌కు చెందిన హర్షద్, ముంబయికి చెందిన సందీప్ నాశ్వాని పట్టుబడటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వీరిని విచారించగా ముఠా కార్యకలాపాలపై కీలక సమాచారం లభించింది. గతంలో ఇదే కేసుకు సంబంధించి హేమంగ్ కెలుస్కర్ సహా 29 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

**పరారీలో మరో కీలక నిందితుడు**

హేమంగ్ కెలుస్కర్ సోదరుడు సుధాంశ్ ప్రమోద్ ఈ డ్రగ్స్ వ్యాపారంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. హైదరాబాద్ కోకాపేటలో "జల్వా" పేరుతో క్లబ్ ఏర్పాటు చేసేందుకు వీరు స్థలం కూడా పరిశీలించినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని పటాయాలో ఇదే పేరుతో క్లబ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**ఎర్రచందనం స్మగ్లింగ్ నుంచి డ్రగ్స్ దందా వరకు**

ప్రధాన నిందితుడు హేమంగ్ కెలుస్కర్ గతంలో అరబ్ దేశాలకు ఎర్రచందనం స్మగ్లింగ్ చేసిన కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లోనూ గతంలో అరెస్టైనట్లు గుర్తించారు. అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక ఉన్న ఇతర వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని ఈగల్ ఫోర్స్ అధికారులు తెలిపారు.



# అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

- క్షణాల్లో అగ్నికుండంగా మారిన కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనం
- మూడు అంతస్తుల భవనాన్ని చుట్టుముట్టిన మంటలు
- దుస్తుల నిల్వలతో వేగంగా వ్యాపించిన అగ్ని
- అప్రమత్తమైన వ్యాపారులు.. విలువైన వస్తువుల తరలింపు
- మంటల అదుపునకు రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కోణంలో దర్యాప్తు

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం):**

నగరంలోని అత్యంత రద్దీ వాణిజ్య ప్రాంతమైన అమీర్‌పేట్‌లో గురువారం సంభవించిన భారీ అగ్నిప్రమాదం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. మైత్రీవనం సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ పేరుతో నడుస్తున్న దుస్తుల దుకాణ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే మూడు అంతస్తుల భవనమంతా వ్యాపించాయి. భారీ అగ్నిజ్వాలలు, దట్టమైన పొగతో ఆ ప్రాంతమంతా అగ్నికుండాన్ని తలపించింది. భవనంలో భారీగా నిల్వ ఉంచిన రెడీమేడ్ దుస్తులు, ఫ్యాబ్రిక్ మెటీరియల్, ఇతర ఇంటీరియర్ సామగ్రి కారణంగా మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీంతో మంటల తీవ్రత మరింత పెరిగి భవనం మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఎగసి పడుతున్న మంటలను చూసి స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

**పక్క దుకాణాల్లో భయాందోళనలు**

అమీర్‌పేట్‌లోని ఈ ప్రాంతం వ్యాపార కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటంతో చుట్టుపక్కల హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, మొబైల్ ఫోన్ దుకాణాలు, ఇతర వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. మంటలు పక్కనే ఉన్న భవనాలకు వ్యాపించే ప్రమాదం ఉందన్న సమాచారంతో వ్యాపారులు తమ దుకాణాల్లోని విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నగదు తదితరాలను అత్యవసరంగా బయటకు తరలించారు. కొందరు భయంతో దుకాణాలను మూసివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

**రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది**

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు అనేక ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. భవనంలోని ప్రతి అంతస్తుకు మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ సహాయక చర్యలు కొనసాగించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు గంటల తరబడి శ్రమించాల్సి వచ్చింది.

**ట్రాఫిక్ మళ్లించిన పోలీసులు**

ఘటనతో అమీర్‌పేట్ ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచి పోయింది. పోలీసులు వెంటనే స్పందించి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రమాద స్థలానికి ప్రజలు చేరకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నప్పటికీ, అధికారికంగా ఇంకా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఘటనలో ఎవరైనా చిక్కుకున్నారా, ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించాయా అనే అంశాలపై అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. భవనానికి, దుకాణంలో నిల్వ ఉన్న వస్తువులకు కోట్ల రూపాయల మేర నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





## ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్

**హైదరాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం):**

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి ఐబీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ మాట్లాడుతూ..ఆటో కార్మికులు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరిగి సాధారణ ప్రజలతో పాటు ఆటో కార్మికులపై అదనపు భారం పడిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయి అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే శాసన మండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆటో కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ వారి పక్షాన గట్టిగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రేమలత మాట్లాడుతూ..ఆటో కార్మికుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షులు రవి రజితపార్టీ నాయకులు, ఆటో కార్మికులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

## హెల్త్ కార్డ్ పేరుతో ఉద్యోగుల జీతాల్లో కోతలు తగదు

- భార్యాభర్తలిద్దరి నుంచి వసూలు చేయడం దారుణం
- కాంగ్రెస్ ప్రభుత్వానివి తుగ్లక్ నిర్ణయాలు
- స్పష్టత లేని స్కీమ్ తో ఉద్యోగులను ఏటీఎంలుగా వాడుకుంటున్నారు
- బీఆర్ఎస్ నేత శీలంశెట్టి రమేష్ తీవ్ర వ్యాఖ్యలు

**గార్ల, జూన్ 04 (ప్రభాత గమనం) :**



రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన స్పష్టత లేని హెల్త్ కార్డ్ విధానంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ధ్వజమెత్తింది. ఎలాంటి విధివిధానాలు ఖరారు చేయకుండానే, మే నెల జీతం నుండి ఏకపక్షంగా 1.5 శాతం కోత విధించడాన్ని ఖండిస్తూ గార్ల బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే.. ఇద్దరి జీతాల నుండి 'డబుల్ కటింగ్' చేయడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా శీలంశెట్టి రమేష్ మాట్లాడుతూ, "భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పుడు వారి కుటుంబం ఒకే యూనిట్ అవుతుంది. అలాంటిది ఇద్దరి జీతాల నుండి విడివిడిగా 1.5% చొప్పున మొత్తం 3% సొమ్మును అక్రమంగా లాక్కోవడం ఏ రకమైన న్యాయం?" అని ప్రశ్నించారు. రేపు ఆసుపత్రికి వెళ్తే భార్య కార్డుపై ఒకరు, భర్త కార్డుపై మరొకరు విడివిడిగా బెడ్లు తీసుకుని వైద్యం చేయించుకుంటారా అని నిలదీశారు. కుటుంబానికి ఒక హెల్త్ కార్డు సరిపోతుందనే కనీస జ్ఞానం కూడా ప్రభుత్వ పెద్దలకు లేకపోవడం విచారకరమన్నారు. ఇది ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధతో చేస్తున్నది కాదని, కేవలం ఖజానా నింపుకోవడానికి ప్రభుత్వం చేస్తున్న "లీగల్ దోపిడీ" అని ఆరోపించారు.ఈ హెల్త్ కార్డ్ స్కీమ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని రమేష్ విమర్శించారు. ఏయే కార్పొరేట్ ఆసుపత్రులు ఈ పరిధిలోకి వస్తాయి? ఉచిత వైద్యం పరిమితి ఎంత? గతంలో లాగా ఆసుపత్రులు ఈ కార్డులను "చెల్లని కాగితాలు" అని తిరస్కరించవనే గ్యారెంటీ ఏంటి? అని ఆయన ప్రశ్నించారు. కనీసం జీవో (GO) లో స్పష్టమైన నిబంధనలు పెట్టకుండా, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా, మే నెల జీతాల బిల్లులు ఆన్‌లైన్ అవ్వడానికంటే ముందే సాఫ్ట్‌వేర్‌లో లింకులు పెట్టి మరీ డబ్బులు కట్ చేయడం దౌర్జన్యపూరిత విధానమని మండిపడ్డారు.భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైన చోట ఒకరికి మాత్రమే కోత వర్తింపజేసి, ఇప్పటికే కట్ చేసిన అదనపు సొమ్మును వెంటనే రీఫండ్ చేయాలి.ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కమిటీ వేసి, నగదు రహిత వైద్యానికి పూర్తి చట్టబద్ధమైన గ్యారెంటీ ఇస్తూ విధివిధానాలు ఖరారు చేయాలి.ఉద్యోగుల సమ్మతి లేకుండా ఏకపక్షంగా జీతాలు కట్ చేసే మొండి వైఖరిని ప్రభుత్వం వీడాలి. తెలంగాణ సాధనలో, రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను ప్రభుత్వం ఏటీఎం మిషన్లుగా భావిస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని శీలంశెట్టి రమేష్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.



## గంజాయి రహిత జిల్లాగా మానుకోట

- 4వేల అత్యాధునిక టెస్టింగ్ కిట్లతో పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
- 10 నిమిషాల్లోనే మాదకద్రవ్యాల వినియోగం నిర్ధారణ
- డీ-అడిక్షన్ కార్యక్రమాలతో బాధితులకు పునరావాసం
- సమాచారం ఇచ్చేవారి వివరాలు పూర్తిగా గోప్యం : ఎస్పీ డా. శబరీష్

**మహబూబాబాద్, జూన్ 4 (ప్రభాత గమనం):**

జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. గంజాయి వినియోగదారులను గుర్తించేందుకు 4,000 అత్యాధునిక టెస్టింగ్ కిట్లను పోలీస్ శాఖ సిద్ధం చేసిందన్నారు. ఈ కిట్ల సహాయంతో అనుమానితులను అక్కడికక్కడే పరీక్షించి కేవలం 10 నిమిషాల్లోనే ఫలితాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తున్నాయని, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గంజాయి వినియోగదారులను కేవలం శిక్షించడమే కాకుండా వారిని వ్యసనం నుంచి బయటపడేలా డీ-అడిక్షన్ కార్యక్రమాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, పోలీస్ శాఖ చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ డా. శబరీష్ పిలుపునిచ్చారు.



## లంచం తీసుకుంటూ ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టివేత

- కొడిమ్యాల అటవీ శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు
- రూ.80 వేల నగదు స్వాధీనం

**జగిత్యాల, జూన్ 4 (ప్రభాత గమనం):**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి మొయినుద్దీన్ రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో అధికారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కార్యాలయ తలుపులు మూసివేసి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల అధికారులపై ఏసీబీ దాడులు పెరుగుతుండగా, అక్రమ ఆస్తులు, అవినీతి వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.



## చెట్లతోనే మానవాళి మనుగడ

- మూడు గుంటల్లో 70చెట్లు పెంచుతున్న దేవా నాయక్
- అంతర పంటలు సాగు చేస్తూ అందరికీ ఆదర్శం
- పర్యావరణ పరిరక్షణకు ఎనలేని కృషి

**నెక్కొండ, జూన్4 (ప్రభాత గమనం):**



వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని బొల్లికొండ గ్రామానికి చెందిన దేవా నాయక్ పర్యావరణ పరిరక్షణ పాటు పడుతున్నాడు. ఓ వైపు ల్యాబ్ టెక్నీషియన్ వృత్తిని కొనసాగిస్తూ.. ఇంటి ఆవరణలో చెట్లను పెంచుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్లు నాటడం, వాటిని పెంచడం అంటే దేవా నాయక్ కు చాలా ఇష్టం. ఇంటి ఆవరణంతో పాటు చుట్టుపక్కల ఉన్న మూడు గుంటల స్థలంలో దాదాపుగా 70 మొక్కలను నాటి కాపాడుతున్నారు. ఇందులో 15 రకాల పండ్ల చెట్లు 5 రకాల పూల చెట్లు, చుట్టూరా కలప చెట్లు, టేకు, శ్రీగంధం, ఎర్రచందనం వంటి వాటిని పెంచుతున్నారు. అందులో అంతర్ పంటగా కూరగాయలను కూడా సాగు చేస్తున్నారు. మామిడి, అరటి సపోటా, కొబ్బరి, సీతాఫలం, పనస, జామ, నిమ్మ, స్టార్ ఫ్రూట్, బొప్పాయి, జీడి మామిడి, పుచ్చకాయ వంటి పండ్ల చెట్లను నాటి పెంచుతున్నారు. అలాగే మల్లెపూలు, ముద్దమందారం, చామంతి వంటి పూల మొక్కలు, టమాట, బెండకాయ, తోటకూర, బీరకాయ, దోసకాయ కొత్తిమీర,పుదీనా వంటి కూరగాయలు సైతం సాగు చేస్తున్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ ఆరోగ్యం మానసిక ప్రశాంతత మెరుగుపడతాయని,స్వచ్ఛమైన గాలి, కాలుష్య నివారణ, వాతావరణ నియంత్రణ, మానసిక ప్రశాంతతను ఇస్తాయని దేవా నాయక్ చెబుతున్నారు. మొక్కలు గాలిని శుభ్రపరిచి మనకు కావాల్సిన ఆక్సిజన్ ను అందిస్తాయని, అంతేకాకుండా వర్షాలు పడటానికి వాతావరణ సమతుల్యతను కాపాడడానికి మొక్కలు ఎంతో అవసరమని తెలిపారు. చెట్లు, మొక్కలు పక్షులకు, కీటకాలు ఇతర జీవులను ఆవాసాలను కల్పిస్తాయని వివరించారు. ముఖ్యంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి భావితరాల భద్రతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఒక బాధ్యతగా భావించాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటడం అంటే భవిష్యత్ లో అందరికీ ప్రాణధారమైన స్వచ్ఛమైన గాలిని పచ్చదనాన్ని బహుమతిగా ఇవ్వడమే అని చెబుతున్నాడు.



## వెల్లంకి లక్ష్మీనారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సీపీఐ రాష్ట్ర నేత కట్టెబోయిన శ్రీనివాస్
- గార్ల మండల సమితి ఆధ్వర్యంలో వెల్లంకి 5వ వర్ధంతి
- స్మారకస్థూపం వద్ద నివాళులర్పించిన సీపీఐ శ్రేణులు

**గార్ల, జూన్ 4 (ప్రభాత గమనం) :**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, గ్రామాభివృద్ధి కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ వెల్లంకి లక్ష్మీనారాయణ అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ కొనియాడారు. సీపీఐ సీనియర్ నాయకులు, రాంపురం గ్రామ శాఖ మాజీ కార్యదర్శి వెల్లంకి లక్ష్మీనారాయణ 5వ వర్ధంతి వేడుకలను గురువారం గార్ల మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని పాకాల ఏటి ఒడ్డున గల లక్ష్మీనారాయణ స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణ తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారన్నారు. రామాపురం గ్రామ నిరుపేదల కష్టాలను తీర్చేందుకు, ముఖ్యంగా పాకాల ఏటిపై హైలెవల్ వంతెన నిర్మించి రహదారి సౌకర్యం కల్పించాలని ఆయన సుదీర్ఘ కాలం పాటు అలుపెరుగని పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని, లక్ష్మీనారాయణ ఆశయ సాధన కోసం సీపీఐ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, ప్రముఖ నాయకులు సింగు రమేష్, దార్ల నాగేష్, లావుడ్య భీముడు, గుండా సుధాకర్ రెడ్డి, సిరిమర్తి నాగరాజు, లాలూ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడికి బాట ఉజ్వల భవిష్యత్తుకు ఇదే బాట

- పెనుగొండ జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం
- ప్రైవేట్ కు దీటుగా వసతులు.. ఇంగ్లీష్ మీడియంలో బోధన
- విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం విస్తృత పర్యటన

**కేసముద్రం, జూన్ 04 (ప్రభాత గమనం):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు కేసముద్రం మండల పరిధిలోని పెనుగొండలో 'బడి బాట' కార్యక్రమం జోరుగా సాగుతోంది. కేసముద్రం మండల విద్యాధికారి మరియు పెనుగొండ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాలేరు యాదగిరి మార్గదర్శకత్వంలో ఉపాధ్యాయ బృందం గురువారం విస్తృత ప్రచారం నిర్వహించింది.పెనుగొండ గ్రామంతో పాటు దాని శివారు ప్రాంతమైన కట్టుగూడెంలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌తో కలిసి ఉమ్మడిగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్తూ బడి వయసు పిల్లల వివరాలను సేకరించారు. బడి ఈడు పిల్లలు ఎవరూ పనులకు వెళ్లకుండా నేరుగా పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు ధీటుగా రూపుదిద్దుకున్నాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో కల్పిస్తున్న అత్యాధునిక వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సాగుతున్న ఇంగ్లీష్ మీడియం బోధన గురించి తల్లిదండ్రులకు వివరించారు."పేదరికాన్ని జయించడానికి విద్యే ఏకైక ఆయుధమని తెలిపారు. పెనుగొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా మా ఉపాధ్యాయ బృందం నిరంతరం శ్రమిస్తోందన్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల ప్రలోభాలకు లోనుకాకుండా, ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఈ గొప్ప అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు."ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగిన ఈ 'బడి బాట' కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# రసాభాసగా మహబూబాబాద్ మున్సిపల్ సమావేశం

- అధికార పక్షాన్ని కడిగిపారేసిన విపక్షాలు..!
- మీడియాను అడ్డుకోవడంపై 'సీపీఐ-బీఆర్ఎస్' కౌన్సిలర్ల ఆగ్రహం, పోడియం వద్ద నిరసన
- రూ. 59 కోట్ల నిధులపై నిలదీత.. విపక్షాలతో శ్రుతి కలిపిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి..
- కొత్త కూరగాయల మార్కెట్, ఓసి క్లబ్ స్వాధీనంపై ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి రెడ్డి డిమాండ్



**మహబూబాబాద్, జూన్ 4:(ప్రభాత గమనం)**

మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం తీవ్ర రసాభాసగా మారింది. వార్డుల అభివృద్ధి, నిధుల కేటాయింపుల్లో అధికార పక్ష వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్ష సీపీఐ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అధికార, ప్రతిపక్షాల మధ్య చెలరేగిన వాగ్వాదంతో మున్సిపల్ హాల్ ఒక్కసారిగా హీటెక్కింది.సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిల్ హాల్‌లోకి మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడంపై ప్రతిపక్ష కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే మీడియాను అడ్డుకుంటున్నారా అని ప్రశ్నిస్తూ సీపీఐ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియంను ముట్టడించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే సమావేశంలోకి మీడియాను వెంటనే అనుమతించాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.మున్సిపాలిటీకి వస్తున్న రూ. 59 కోట్ల నిధుల వ్యయంపై విపక్షాలు అధికార పక్షాన్ని గట్టిగా నిలదీశాయి. ప్రతి వార్డుకు రూ. 50 లక్షల చొప్పున అభివృద్ధి పనులు జరగడం లేదని సీపీఐ, బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ పక్ష కౌన్సిలర్లు స్పందిస్తూ.. వార్డుల్లో పనులు జరుగుతున్నాయని సమాధానం ఇవ్వడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. "ఏ ఏ వార్డుల్లో 50 లక్షలతో పనులు జరిగాయో, ఎక్కడెక్కడ వర్కులు నడుస్తున్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలి" అంటూ అధికారులను, అధికార పక్షాన్ని విపక్షాలు కడిగిపారేశాయి.

ఈ నిరసనకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు కూడా మద్దతు పలికారు. బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లతో కలిసి ఆయన శ్రుతి కలిపారు. వార్డులన్నింటికీ సమానంగా నిధులు కేటాయించాలని, తక్షణమే అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు.సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ.. 33వ వార్డులో నిర్మించిన కొత్త కూరగాయల మార్కెట్‌ను మూడుసార్లు ప్రారంభోత్సవం చేసినా.. ఇప్పటివరకు ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదని మండిపడ్డారు. విలువైన ఓసి క్లబ్ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. రోడ్డుపైనే శ్రీరాముని కళ్యాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.పూసపెల్లి రోడ్డు, పత్తిపాక రోడ్డుతో పాటు 36వ వార్డులోని ఏ-క్యాబిన్ ప్రధాన రహదారిని, కంకర బోర్డు పెద్ద రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కంకర బోర్డులో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకును వెంటనే ప్రారంభించి, ప్రజల తాగునీటి తిప్పలు తప్పించాలన్నారు. గాంధీ పార్కును అందుబాటులోకి తేవాలని కోరారు.18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ మాట్లాడుతూ.. తన వార్డులోని స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని, రూ. 50 లక్షల నిధులతో వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మాట్లాడుతూ.. జగన్ కాలనీలోని బావిని క్లీన్ (స్క్రీనింగ్) చేయించి, వార్డులో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రతి వార్డుకు రూ. 50 లక్షల నిధులు ఇస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. మొత్తానికి ప్రజా సమస్యలను పక్కనబెట్టి, మీడియాను దూరం పెట్టి సభను మమ అనిపించాలన్న అధికార పక్ష వ్యూహాన్ని విపక్షాలు పూర్తిగా తిప్పికొట్టడంతో మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- గార్లలో ఎస్సై, ఏవో ఆకస్మిక తనిఖీలు!
- రైతులను మోసం చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు
- తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి, ధరల పట్టికలు ప్రదర్శించాలి
- నిఘా నిరంతరం కొనసాగుతుంది : ఎస్సై సాయికుమార్, వ్యవసాయాధికారి రామారావు

**గార్ల, జూన్ 4 (ప్రభాత గమనం):**

వానకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా ఉండేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా రంగంలోకి దిగాయి. గార్ల మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్, అగ్రో విత్తన దుకాణాల్లో సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) సాయికుమార్, మండల వ్యవసాయ అధికారి (ఏవో) రామారావు గురువారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడటం, నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టారు.తనిఖీల్లో భాగంగా అధికారులు దుకాణాల్లోని విత్తన నిల్వలు (స్టాక్), వాటి నాణ్యత ప్రమాణాలు, డీలర్ల లైసెన్సులు మరియు విక్రయాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిల్వ ఉన్న విత్తనాలకు, రికార్డుల్లో ఉన్న లెక్కలకు సరిపోలిక ఉందా లేదా అనే అంశాలను నిశితంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై సాయికుమార్, ఏవో రామారావు మాట్లాడుతూ.. లాభార్జనే ధ్యేయంగా రైతులను మోసం చేస్తూ నకిలీ, కాలం చెల్లిన లేదా అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి విక్రయానికి సంబంధించి రైతులకు ఖచ్చితంగా కంప్యూటర్ లేదా మాన్యువల్ బిల్లులు/రసీదులు ఇవ్వాలని, దుకాణాల్లో స్పష్టంగా కనిపించేలా ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు."రైతులు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ గుర్తింపు పొందిన అధికారిక దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి. కొనుగోలు చేసిన ప్రతిదానికి ఖచ్చితంగా రసీదు (బిల్లు) తీసుకోవాలి. విత్తన సంచులు, బిల్లులను పంట చేతికి వచ్చే వరకు భద్రపరుచుకోవాలి. ఏదైనా అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలి." రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే ధ్యేయంగా, నకిలీల నియంత్రణే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష
- అన్ని శాఖల సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు డెయిరీ రంగం కీలకమన్న ఎమ్మెల్యే
- పాల సేకరణ కేంద్రాల బలోపేతం, సభ్యుల నమోదుపై ప్రత్యేక దృష్టి
- హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాల పురోగతిపై సమీక్ష

**హనుమకొండ, జూన్ 4 (ప్రభాత గమనం):**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షత వహించగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఆర్‌డీఓలు మేన శ్రీను, నాగ పద్మజతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) అధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై ఎమ్మెల్యే సమగ్ర సమీక్ష నిర్వహించారు. పరకాల మహిళా డెయిరీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాలకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డెయిరీ అభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు, అదనపు ఆదాయం లభిస్తాయని అన్నారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతను మరింత బలోపేతం చేయడంలో డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డెయిరీ కార్యకలాపాల విస్తరణ, పాల సేకరణ కేంద్రాల బలోపేతం, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, కొత్త సభ్యుల నమోదు వంటి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత లక్ష్యాలను సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సహకార శాఖ అధికారి సంజీవ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు రాధాకిషన్, బాలకృష్ణ, అడిషనల్ డీఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, డీపీఎంలు సరిత, వరలక్ష్మి, మెప్మా కోఆర్డినేటర్లు రజిత రాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గార్ల మండలంలో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం
- మోడీ పాలనలో అభివృద్ధిని ఇంటింటికీ చేర్చాలని పిలుపు
- పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచన

**గార్ల, జూన్ 4 (ప్రభాత గమనం):**

గార్ల మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎస్ఐఆర్ మండల స్థాయి సమావేశం, అనంతరం మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి పుణ్య నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య శీను నాయక్, రాష్ట్ర మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి విమల్ కుమార్ జైన్, కౌన్సిల్ మెంబర్ జంపాల శ్రీను, మండల ఇన్‌చార్జి పుణ్య నాయక్ హాజరై మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోన సాయికృష్ణ, నాయకులు దేవా, వీర్య నాయక్, గణేష్, రాంబాబు, వాసు, బుచ్చిబాబు, సోనియా, రాము, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, విజయ్, నాగేష్, దేవేందర్, బూత్ అధ్యక్షుడు సిద్ధమైన లక్ష్మయ్య పాల్గొన్నారు.

## జనగణన దేశాభివృద్ధికి పునాది

- ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొని సహకరించాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, జూన్ 4( ప్రభాత గమనం):**



జనగణన దేశ అభివృద్ధికి పునాది వంటిదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించేందుకు ఇది అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో జనగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తన కుటుంబ వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుందని తెలిపారు. అందువల్ల ప్రజలు ఎటువంటి సందేహాలకు తావివ్వకుండా ఎన్యూమరేటర్లకు పూర్తి, ఖచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. ప్రతి కుటుంబం ఈ జాతీయ కార్యక్రమంలో బాధ్యతగా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

# 'బడిబాట'ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

- బడిబయటి పిల్లలు బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ జూన్ 4(ప్రభాత గమనం):**



గురువారం కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి ఇంచార్జ్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, అన్ని జిల్లా ప్రధాన అధికారులతో కలిసి 18 మండలాల ఎంపీడీవోలు మండల విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమం నిర్వహణ విజయవంతం పై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి ప్రతి ఒక్క విద్యార్థిని,విద్యార్థులను ప్రభుత్వ మండల ప్రాథమిక, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలు అత్యాధునిక విద్య నూతన టెక్నాలజీ ద్వారా విద్యను అందించడం జరుగుతుందని రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించడం కోసం ప్రత్యేక డైట్ మెనూ ప్రవేశ పెట్టడం జరిగిందని, క్రీడలు మానసిక ఉల్లాసం ప్రశాంతత వాతావరణంలో విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వ విద్యాసంస్థలు సిద్ధంగా ఉన్నాయని ఇట్టి విషయాన్ని తల్లిదండ్రులకు పిల్లలకు తెలియజేసి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యను అభ్యసించే విధంగా కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర,రాష్ట్ర, ప్రభుత్వ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ సూచించిన ప్రకారం టాయిలెట్స్ నిర్మించాలని అంతర్గత నిర్మాణ పనులు పూర్తి చేయాలని జూన్ 12న స్కూల్లో ప్రారంభం నేపథ్యంలో ప్రతి ఒక్కటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేయుచున్న వంట సిబ్బంది, నాలుగవ తరగతి సిబ్బంది అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారినీ ఆదేశించారు. సి డబ్ల్యు సి,అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లల వివరాలు, బడి ఈడు కు వచ్చిన పిల్లల వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించి నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే ప్రైవేటు విద్యాసంస్థలలో నడిచే వాహనాల యొక్క ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అన్ని విభాగాల సంబంధిత అధికారులు, మండల కేంద్రాల నుండి ఎంపీడీవోలు ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374